బెల్ట్ తీయలేదు


బెల్ట్ దుకాణంలో పట్టుబడిన మద్యం(ఫైల్)

- గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం
- ఇష్టానుసారం బెల్ట్ దుకాణాల ఏర్పాటు
- కూటమి నాయకుల కనుసన్నల్లోనే వ్యాపారం
- నేరుగా లైసెన్స్ దుకాణాల నుంచే సరఫరా

మండలాల వారీగా బెల్ట్ దుకాణాలు: (అంచనా)

పెందుర్తి గ్రామీణ ప్రాంతంలో..
పంచాయతీలు : 15 గ్రామాలు : 33
బెల్ట్ దుకాణాల సంఖ్య: దాదాపు 50
పట్టణ ప్రాంతంలో దుకాణాలు : దాదాపు 200

సబ్బవరంలో..
పంచాయతీలు : 24 గ్రామాలు : 60
బెల్ట్ దుకాణాల సంఖ్య: దాదాపు 130

పరవాడలో..
పంచాయతీలు : 14 గ్రామాలు : 35
బెల్ట్ దుకాణాలు : దాదాపు 70

పెందుర్తి: నియోజకవర్గంలో మద్యం బెల్ట్ దుకాణాలు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రోజురోజుకూ పెరుగుతున్నాయి. స్వయంగా కూటమి నాయకుల కనుసన్నల్లోనే ఆయా దుకాణాలు వెలుస్తున్నాయి. ఫలితంగా జనవాసాల్లో బెల్ట్ దుకాణాల ద్వారా మద్యం ఏరులై పారుతోంది.

నియోజకవర్గ కేంద్రం పెందుర్తి, గ్రామీణ ప్రాంతం సబ్బవరం, పారిశ్రామిక ప్రాంతం పరవాడలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. దాదాపు ప్రతీ గ్రామంలో రెండుమూడు దుకాణాలు నడుస్తున్నాయి. పెందుర్తి, సబ్బవరం, పరవాడ ప్రాంతాల్లో తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకునే క్రమంలో ప్రధాన దుకాణదారులే బెల్ట్ దుకాణాలకు స్వయంగా మద్యాన్ని సరఫరా చేయడం గమనార్హం. ఇందు కోసం నేరుగా దుకాణదారులే రంగంలోకి దిగి గ్రామాల్లో వేలం పాటల ద్వారా బెల్ట్ దుకాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. నియోజకవర్గంలో ఈ తరహా బెల్ట్ వ్యాపారం సిండికేట్ ప్రధాన దుకాణాలకు అంతర్గతంగా జరుగుతుండడం గమనార్హం.

సిండికేట్ల చేతుల్లోనే..

వాస్తవానికి మద్యం దుకాణాల నిర్వహణ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయిన తరువాత బెల్ట్ దుకాణాలకు మార్గం సుగమం అయింది. లైసెన్స్ దుకాణాలు దాదాపు 90 శాతం కూటమి నాయకుల చేతిలోనే ఉండడంతో బెల్ట్ దుకాణాలకు మద్యం సరఫరా, అమ్మకాలకు ఇబ్బంది లేకుండా పోయింది. వీరంతా సిండికేట్‌గా ఏర్పడి యథేచ్ఛగా బెల్ట్‌ను ప్రోత్సహిస్తున్నారు. దుకాణాల్లో మద్యం సేల్ పెరగాలంటే బెల్ట్ దుకాణాల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నది వారి వ్యాపార సూత్రం. 2014–2019 వరకు టీడీపీ హయాంలో ప్రైవేట్ మద్యం పాలసీ అమలు కావడంతో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి మద్యం వినియోగదారులను ఇష్టానుసారం దోచుకునేవారు. విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలను ప్రోత్సహించి, అవసరం అయితే బెల్ట్ దుకాణాల నిర్వాహకుల ఇళ్లకే మద్యాన్ని సరఫరా చేసి గ్రామాల్లో నిరంతరం మద్యం అందుబాటులో ఉండేలా చూసుకునేవారు. అయితే 2019లో ప్రైవేట్ మద్యం పాలసీని పూర్తిగా రద్దు చేసి, బెల్ట్ దుకాణాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తిగా నియంత్రణలో ఉంచిన సంగతి తెలిసిందే. కానీ తాజాగా కూటమి ప్రభుత్వం రావడం, మద్యం వ్యాపారం ప్రైవేట్‌పరం చేయడంతో మళ్లీ అంతా సిండికేట్ల చేతిలోకి వెళ్లిపోయింది. ఫలితంగా గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుంది. 24 గంటలూ మందుబాబులకు మద్యం అందుబాటులోనే ఉంటోంది.

చర్యలు తీసుకుంటాం



లైసెన్స్ ఉన్న మద్యం దుకాణాల్లో మాత్రమే నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలు జరగాలి. బెల్ట్ దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు చేస్తే కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటాం. బెల్ట్ దుకాణాలపై దాడులు విస్తృతంగా చేస్తున్నాం. బెల్ట్ దుకాణాలపై ప్రజలు సమాచారం ఇస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం.

– కె.వి సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి లా అండ్ ఆర్డర్

పోయిన బ్యాగ్ దొరికింది

- ఆటో నుంచి జారిపడిన బ్యాగ్ పోలీసుకు దొరికిన వైనం
- పోలీస్ స్టేషన్‌లో బాధితురాలికి అందజేత


బాధితురాలికి బ్యాగ్ అందిస్తున్న ఎస్‌ఐ దేముడునాయుడు, చిత్రంలో హెచ్‌సీ కృష్ణ

పెందుర్తి: వెండి ఆభరణాలు, నగదుతో ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను ఓ మహిళ పోగొట్టుకుంది. అయితే సినీ ఫక్కీలో ఆ బ్యాగ్ పోలీస్‌కు దొరికింది. ఇటు బాధితురాలి ఫిర్యాదు..అటు పోలీస్ బాధ్యత వెరసి, వెంటనే బాధితురాలి చెంతకు బ్యాగ్ చేరింది..

వివరాలివి..ఎస్.కోటకు చెందిన రొట్ట వసంత ఆటోలో ఎస్.కోట నుంచి నగరానికి వస్తోంది. సరిపల్లి వద్దకు వచ్చేసరికి 21 తులాల వెండి, రూ.4,500 నగదు ఉన్న ఆమె హ్యాండ్ బ్యాగ్ జారిపడిపోయింది. పెందుర్తి కూడలి వద్దకు వచ్చిన తరువాత గుర్తించిన వసంత వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా, అదే సమయంలో సరిపల్లి వైపు విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కృష్ణకు రోడ్డు పక్కన బ్యాగ్ కనిపించింది. వెంటనే బ్యాగ్‌ను స్టేషన్‌కు తీసుకువచ్చిన హెచ్‌సీ కృష్ణ సీఐ కె.వి సతీష్‌కుమార్‌కు తెలిపారు. అదే సమయంలో బాధితురాలు వసంత అక్కడే ఉండడంతో వెంటనే ఎస్‌ఐ దేముడునాయుడు చేతుల మీదుగా ఆమెకు బ్యాగ్‌ను అందించారు.

క్లుప్తంగా

సింహాచలం డిపో ఇన్‌చార్జి డీఎంగా శరత్‌బాబు


శరత్‌బాబును అభినందిస్తున్న రాజశేఖర్, ఉద్యోగులు

సింహాచలం: సింహాచలం ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి డీఎంగా ఎస్.శరత్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయం నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు డిపో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.రాజశేఖర్‌కు డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్‌గా(జోన్–1) పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంగా బాధ్యతలు స్వీకరించిన శరత్‌బాబుకు రాజశేఖర్ పుష్పగుచ్ఛం ఇచ్చి, అభినందనలు తెలిపారు. ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు


విద్యార్థులతో ఖోఖో ఆడిస్తున్న గ్రంథాలయాధికారి శిరీష తదితరులు

సబ్బవరం: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని గ్రంథాలయ అధికారి వి.శిరీష అన్నారు. సబ్బవరం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులతో వార్తాపత్రికలు చదివించిన అనంతరం ఖోఖో ఆడించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి రోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ రత్నకుమారి, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి శిబిరంలో యోగా శిక్షణ


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం యోగా శిక్షణ ఇచ్చారు. ముందుగా కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జానకిరామ్ చిన్నారులకు నీతి కథలను బోధించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. బి.లక్ష్మీతేజ విద్యార్థులతో యోగాసనాలు అభ్యసనం చేయించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

దువ్వపాలెంలో మంచినీటి పథకానికి శ్రీకారం



మంచినీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ చంద్రవాణి

పెందుర్తి: జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా వాలిమెరక పంచాయతీ దువ్వపాలెంలో నిర్మించనున్న మంచినీటి పథకానికి సర్పంచ్ బొడ్డు చంద్రవాణి ప్రకాష్ గురువారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీలో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంక్‌ను ఇక్కడ నిర్మిస్తున్నామని వెల్లడించారు. గ్రామ పెద్దలు బొడ్డు సూర్యప్రకాష్, సియాద్రి రమణ, గంర్రెడ్డి బాలాజీ, బి.కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా గోపీజన వల్లభ స్వామి ఆలయ వార్షికోత్సవం

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పరిధి లక్ష్మీనరసింహనగర్‌లోని శ్రీ గోపీజన వల్లభ స్వామి ఆలయ 13వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 6గంటల నుంచి స్వామికి గోక్షీరాభిషేకం, 7.30గంటల నుంచి సహస్ర నామార్చన, 9గంటల నుంచి శాంతి గీతాయజ్ఞం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ప్రసాదం అందజేసింది.

వివాహిత అదృశ్యం


గొలగాని అనురాధ

సబ్బవరం: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సింహాచలం తెలిపారు. సబ్బవరం గోపాల్‌నగర్‌లో నివాసం ఉంటున్న గొలగాని అనురాధ (31) గత నెల 30వ తేదీన ఉదయం 8 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు బంధువుల ఇంటి వద్ద వెతికినా మహిళ ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ సూచించారు.

కనులపండువగా దుర్గమాంబ పండగ


అమ్మవారి సన్నిధిలో అమర్‌నాథ్, అదీప్‌రాజ్

పరవాడ: పెదముషిడివాడ శివారు గండివానిపాలెం గ్రామంలో కొలువుదీరిన దుర్గమాంబ అమ్మవారం పండగను గ్రామస్తులు గురువారం కనులపండువగా జరుపుకొన్నారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ అమ్మవారి చల్లని చూపు ఈ ప్రాంత ప్రజలపై ఎప్పుడూ ఉండాలని కోరుకుంటున్నామన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు నందవరపు శ్రీను, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, పెదముషిడివాడ సర్పంచ్ పల్లా అప్పారావు నాగమణి, గొర్లివానిపాలెం ఎంపీటీసీ జి.వరలక్ష్మి ఎరుకునాయుడు, నాయకులు పైల అప్పలనాయుడు, బొద్దపు చిన్నారావు, యలమర్తి బుజ్జి పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ తల్లి పండగ


అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తున్న అదీప్‌రాజ్, శిరీష దంపతులు

పెందుర్తి: రాంపురం ప్రజల ఆరాధ్య దేవత బంగారమ్మతల్లి వార్షిక పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణ చేసి, ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. వందలాది మంది భక్తులు అగ్ని గుండాలు తొక్కారు. పసుపు కుంకుమలు, చీరలు, ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ చేపట్టారు. పలువురు నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భారీఎత్తున మజ్జిగ వితరణ చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బాణసంచా కాల్పులు అబ్బురపరిచాయి. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్, సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష దంపతులు, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

క్లూ లేకున్నా.. కేసు ఛేదించారు

- అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తి నుంచి గొలుసు చోరీ
- సాంకేతికత సహాయంతో నిందితుల గుర్తింపు
- రెండు తులాల గోల్డ్ చైన్ రికవరీ


సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

సబ్బవరం: అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తి నుంచి బంగారు గొలుసు చోరీ చేసిన వ్యక్తుల నుంచి చైన్ రికవరీ చేసి, కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ విష్ణు స్వరూప్ తెలిపారు. క్లూ లేకున్నా నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సిబ్బందిని అభినందించారు. సబ్బవరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ సింహాచలం, దివ్యతో కలసి గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిలోని చిన్నయ్యపాలెం వద్ద చినముషిడివాడకు చెందిన శ్రీనాథ జగన్నాథం ఈ నెల 26న అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. ఆయన మెడలోని సుమారు రెండు తులాల బంగారు గొలుసును ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు తీసుకుని వెళ్లిపోయారు. బాధితుడి ఫిర్యాదుతో అప్రమత్తమైన పోలీసులు ఆ సమయంలో సబ్బవరం నుంచి పెందుర్తి వైపు ద్విచక్రవాహనంపై వెళ్లి, షాపుల వద్ద ఆగిన వారి వివరాలను సాంకేతిక సహాయంతో గుర్తించి, నిందితులను పట్టుకున్నారు. వారిని పెందుర్తి ప్రాంతానికి చెందిన సయ్యద్ నిజాముద్దీన్(25), బానుగుల నవీన్(27), పెనుమళ్ల చంద్రశేఖరరావు(45)గా గుర్తించారు. వారు సుమారు రూ.2 లక్షలకు పైగా విలువ చేసే ఆ చైన్‌ను బయట మార్కెట్‌లో రూ.1.5 లక్షలకు అమ్మేశారు. దీంతో ఆ చైన్‌ను రికవర్ చేసి, కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఎటువంటి క్లూ లేకపోయినా, చాకచక్యంతో కేసును ఛేదించిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

పాన్‌షాపు దగ్ధం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, ఐద్వా ప్రతినిధి మాణిక్యం


పరవాడ సంతబయలులో దగ్ధమైన పాన్ షాపు

పరవాడ: సంతబయలులో గురువారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన తెలు అప్పలరాజు పాన్‌షాపు దగ్ధమైంది. ఈ ప్రమాదానికి గుర్తు తెలియని వ్యక్తులే కారణమని భావిస్తున్నారు. అప్పలరాజు బుధవారం రాత్రి షాపు మూసివేసి ఇంటికి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం షాపు తెరవడానికి వచ్చి చూడగా దుకాణం పూర్తిగా కాలిపోయి ఉంది. షాపులో ఉన్న డ్రింక్‌లు, సిగరెట్లు, పౌడర్లు, సబ్బులు తదితర సామగ్రి పూర్తిగా కాలిబూడిదయ్యాయని వాపోయాడు. అగ్నిప్రమాదంపై పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలాన్ని పరవాడ మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం పరిశీలించారు.

వరస అగ్నిప్రమాదాలు

సంతబయలులో ఇది తొమ్మిదో అగ్ని ప్రమాదమని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల గ్రామంలో చెప్పుల దుకాణం, అంతకు ముందు అయ్యప్ప పూజా సామగ్రి దుకాణం, ఎరువుల దుకాణం, పలు పాన్‌షాపుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించి దుకాణ యజమానులు తీవ్రంగా నష్టపోయారు. వరుస అగ్నిప్రమాదాలు ఎలా జరుగుతున్నాయన్నది ఎవరికీ అంతు చిక్కడం లేదు.

కార్మికుల పక్షాన అలుపెరగని పోరాటం

- పునరుద్ఘాటించిన కార్మిక నేతలు
- ఘనంగా మే డే వేడుకలు



ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నేతలు


ఫార్మాసిటీలో మేడే వేడుకలు నిర్వహిస్తున్న కార్మికులు

పెందుర్తి: కార్మికుల పక్షాన నిరంతరం పోరాడతామని కార్మిక నాయకులు పునరుద్ఘాటించారు. కార్మిక దినోత్సవాన్ని నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. మే డే సందర్భంగా వాడవాడలా అరుణ పతాకాలను ఎగరవేశారు.

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగతామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మే డే సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో గురువారం గిరిప్రసాద్‌నగర్, బర్ధన్‌నగర్, పెందుర్తి, వేపగుంట ప్రాంతాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ నాయకులు అసిరినాయుడు, రాము, రమణ, దుర్గారావు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల రక్షణకు పోరాటం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్ ఆరోపించారు. కార్మిక హక్కుల రక్షణ కోసం అందరం ఏకతాటిపై నిలిచి పోరాడాలని పిలుపునిచ్చారు. పెందుర్తి సీఐటీయూ జోన్ కమిటీ ఆధ్వర్యంలో పెందుర్తిలో జెండా ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ కార్మిక చట్టాలు ఉన్నా వాటిని ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చేలా జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శంకర్రావు, బాషామౌలాలి, జగన్నాథస్వామి, జయబాబు, మహేష్‌ప్రభు, ఈశ్వరరావు, ఐద్వా జిల్లా నాయకురాలు బి.రమణి, వెంకటలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

గిరిజన కార్మికులకు అండ

పెందుర్తి ప్రాంత గిరిజన ఉద్యోగులకు, కార్మికులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని పెందుర్తి ప్రాంత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు లకె చిట్టిబాబు అన్నారు. చినముషిడివాడలోని సంఘం కార్యాలయంలో గిరిజన ఉద్యోగులను, కార్మికులను గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఏ సమస్య ఉన్నా కార్మికులు, ఉద్యోగులు సంఘం దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి దీసరి భాస్కరరావు, ప్రతినిధులు బాకురు కరుణాకరరావు, కొర్ర బైరాగిమూర్తి, శెట్టి లక్ష్మణరావు, పొత్తూరు మల్లేశ్, తోట లింగమూర్తి, శెట్టి జయదాస్ తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో..

పరవాడ: మండలంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఫార్మాసిటీలో విజయశ్రీ, బైకాన్, ఐవోసీ, సింహాద్రి జంక్షన్, రాంకీ ఎస్ఈజెడ్ కూడళ్లలో స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ల నాయకులు కృష్ణ బాబూరావు, కర్రి పోతినాయుడు, నాగప్పారావు, ఎస్.శ్రీను సీఐటీయూ జెండాలను ఆవిష్కరించారు.

- ఎన్టీపీసీ, వాడచీపురుపల్లి, తిక్కవానిపాలెం, దీపాంజలినగర్, పరవాడ సినిమాహాలు, సబ్‌స్టేషన్ కూడళ్లలో మే డే వేడుకలు నిర్వహించారు.
- కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ కింద మార్చి వాటిని అమలు చేయడం కోసం బీజేపీ ప్రభుత్వం ప్రయత్నించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. పరవాడ తహసీల్దారు కార్యాలయం వద్ద ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ చట్టాలు అమలు జరిగితే కార్మిక హక్కులు ఉండవన్నారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బొద్దపు శ్రీను, రమణ, కనకారావు, రమేష్, సంతోష్, లక్ష్మణ్, అప్పారావు పాల్గొన్నారు.


సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ నేత శ్రీనివాసరావు


గిరిజన ఉద్యోగులను సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు



పరవాడ తహసీల్దారు కార్యాలయం వద్ద మేడే వేడుకల్లో పాల్గొన్న ఐద్వా కార్యకర్తలు

స్టీల్ ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా 'కొమ్ము'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ నూతన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోక్‌ఓవెన్స్ విభాగం జనరల్ ఫోర్‌మెన్ కొమ్ము ప్రసాదరావు నియమితులయ్యారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో గురువారం యూనియన్ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్ కొమ్ము నియామకాన్ని ప్రకటించారు. ఇంత వరకు ఐఎన్‌టీయూసీ చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన కొమ్ము ప్రసాద్ సేవలను గుర్తించి పెద్ద బాధ్యతలు అప్పగిస్తున్నామని రాజశేఖర్ తెలిపారు. ఆయన నియామకం ద్వారా యూనియన్ మరింత బలోపేతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు పి.వి. రమణమూర్తి, గోపాలరాజు, ఎస్‌ఏ నాయుడు, మద్ది అప్పలరాజు, జగదీష్, సుబ్బారావు, ఎన్. రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన


రోడ్డు విస్తరణ పనులు, చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

సబ్బవరం: మండలంలోని రాయపూర్–విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చిన్నయ్యపాలెం వద్ద కోల్పోయిన నీటిపారుదల వసతులను పునర్నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సూచించారు. చిన్నయ్యపాలెం వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను గురువారం పరిశీలించిన ఆయన స్థానిక రైతులు, అధికారులు, హైవే సిబ్బందితో మాట్లాడారు. ప్రస్తుతం చిన్నయ్యపాలెం వద్ద జరుగుతున్న పనుల్లో చెరువు గర్భం పూడుకుపోతున్నందున, సాగునీటి వనరులను నష్టపోతామని చిన్నయ్యపాలెం, తవ్వవానిపాలెం, ఆదిరెడ్డిపాలెం, పెదనాయుడుపాలెం గ్రామాల ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. నీటి పారుదల వసతులు పునరుద్ధరించాలని కోరారు. రోడ్డు విస్తరణను, సాగు నీటి చెరువును పరిశీలించిన ఆయన సమస్యను సానుకూలంగా పరిష్కరిస్తామని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఇరిగేషన్ జేఈ నళిని, ఆర్‌ఐ వీరయ్య, నేషనల్ హైవే అధికారులు, నాయకులు బలిరెడ్డి అప్పారావు, బోకం స్వామినాయుడు, సబ్బవరపు కనకరాజు, సింగంపల్లి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులకు కూటమి ద్రోహం


ప్రసంగిస్తున్న సీహెచ్ నర్సింగరావు

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు టీడీపీ, జనసేన, బీజేపీ ద్రోహం చేస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు ఆరోపించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పాతగాజువాకలో నిర్వహించిన మేడే కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. స్టీల్‌ప్లాంట్‌లో మూడు వేల మంది కార్మికులను తొలగిస్తున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం అన్యాయమన్నారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ ఈనెల 20న నిరవధిక సమ్మె నిర్వహించనున్నట్టు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా ఇక్కడ కూడా సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

రాష్ట్రానికి అన్యాయం: చంద్రబాబు, నితీష్ కుమార్ మద్దతుతోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నడుస్తుందన్నారు. అయినా రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చంద్రబాబు దృష్టిసారించడం లేదని ఆరోపించారు. కార్మికుల ఐక్య పోరాటాల కారణంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కాకుండా అడ్డుకోగలుగుతున్నామన్నారు. నాయకులు ఎం.జగ్గునాయుడు, ఎం.రాంబాబు, కె.కిరీటం పాల్గొన్నారు.